క్లుప్తంగా

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ఆమనగల్లు: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి ఆవరణలో మంగళవారం ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, పీఆర్‌ఓ పాషా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నర్సింగ్ సిబ్బంది సేవలు వెలకట్టలేనివి



అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా కేక్ కట్‌చేస్తున్న సిబ్బంది

ఆమనగల్లు: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి ఆవరణలో సోమవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆస్పత్రి వైద్యాధికారి డా.నాగరాజు, డా.మంజులాదేవి ఆధ్వర్యంలో కేక్ కట్‌చేశారు. అనంతరం ఆస్పత్రిలో పనిచేస్తున్న ఏఎన్ఎంలు, స్టాఫ్ నర్సులు, హెడ్ నర్సులు, నర్సింగ్ సిబ్బందిని సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వైద్యరంగంలో నర్సింగ్ సిబ్బంది అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని అన్నారు. కార్యక్రమంలో సిబ్బంది ఏసుమణి, ఎల్బిబా, సునీత, రత్నజ్యోతి, గాయత్రి, అలివేలు, నాగేశ్వరి, వీణ, నీరజ, భారతమ్మ, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్ జడ్జి రమాకాంత్‌కు సత్కారం



న్యాయమూర్తిని సత్కరిస్తున్న న్యాయవాదులు

ఆమనగల్లు: నాగర్‌కర్నూల్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి రమాకాంత్‌ను సోమవారం ఆమనగల్లు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు మర్యాదపూర్వకంగా కలిశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యాదీలాల్ ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ జిల్లాకోర్టులో రమాకాంత్‌ను కలిసి సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు జమీల్, కృష్ణ, ఆంజనేయులు, శ్రీనివాస్, శిరిష్, శ్రీశైలం, మసూద్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల వేలం.. రూ.4.91 లక్షల ఆదాయం



ఆమనగల్లు ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో వాహనాల వేలం

ఆమనగల్లు: పట్టణంలోని ఎక్సైజ్ పోలీసు స్టేషన్ ఆవరణలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనా లకు వేలం నిర్వహించగా రూ.4.91 లక్షల ఆదాయం సమకూరింది. ఆమనగల్లు ఎక్సైజ్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాల పరిధిలో ఆయా కేసుల్లో పట్టుబడి పోలీసు స్టేషన్ ఆవరణలో ఉన్న వాహనాలకు సోమవారం వేలం నిర్వహించారు. ఎక్సైజ్ పోలీసు స్టేషన్ ఆవరణలో ఎక్సైజ్ డీసీ ఉజ్వలారెడ్డి, ఆమనగల్లు సీఐ బద్యానాథ్ చౌహాన్ ఆధ్వర్యంలో వేలంపాట కొనసాగింది. వేలంపాట ద్వారా లభించిన ఆదాయాన్ని ప్రభుత్వ ట్రెజరీలో జమచేసినట్లు సీఐ తెలిపారు.

రైతులకు భోజనవసతి



రైతులకు భోజనం వడ్డిస్తున్న నాయకులు

ఆమనగల్లు: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలో రైతులకు మధ్యాహ్నం అందిస్తున్న భోజన వసతి కార్యక్రమం కొనసాగుతోంది. మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీత, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ సొంత ఖర్చుతో రైతులకు మధ్యాహ్న భోజన వసతి కల్పిస్తున్నారు. మార్కెట్‌యార్డు ఆవరణలో సోమవారం కార్యక్రమాన్ని మార్కెట్ కమిటీ డైరెక్టర్ వస్పుల శ్రీశైలం ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు వస్పుల శ్రీకాంత్, ప్రసాద్, విజేందర్, మార్కెట్ కమిటీ సిబ్బంది కేశ్యానాయక్, వినోద్, కృష్ణ, కిరణ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం.. భూగర్భజలం

వాన నీటిని ఒడిసిపట్టేలా.. వృథాకు అడ్డుకట్ట వేసేలా పల్లెల్లో ఫాంపాండ్స్ పనులు చేపడుతున్నారు. ఉపాధి కూలీలతో అన్ని గ్రామాల్లో కందకాలు తవ్విస్తున్నారు.. భవిష్యత్తులో భూ గర్భజలాలు పెంచేలా అధికారులు ముందు చూపుతో పనులు చేయిస్తున్నారు.

వాననీటిని ఒడిసిపట్టేలా చర్యలు

- గ్రామాల్లో విరివిగా ఫాంపాండ్స్ పనులు
- కూలీలతో చేయిస్తున్న ఈజీఎస్ అధికారులు
- ఈ ఏడాది మూడు నెలల్లో 126కి పైగా పూర్తి
- రైతులకు చేకూరనున్న లబ్ధి



నస్దిక్‌సింగారం గ్రామంలో ఫాంపండ్స్ పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

యాచారం: భూగర్భజలాల పెంపే లక్ష్యంగా అధికారులు ఉపాధి పనులు చేయిస్తున్నారు. కూలీల ద్వారా రూ.లక్షలాది నిధులతో చెపట్టే పనులు వృథా కాకుండా సద్వినియోగం అయ్యేలా కృషి చేస్తున్నారు. ఈ ఏడాది మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో ఫాంపాండ్స్ పనులపైనే దృష్టి సారించారు. గతంలో ఉపాధి పనులంటే కంపచెట్లు తొలగించడం.. ఏడాదిలోపు ఆ చెట్లు మళ్లీ జీవం పోసుకుని పెరిగి పెద్ద కావడం.. తిరిగి వాటినే నరికేయడం వంటి పనులతో నిధుల వృథా తప్ప ప్రయోజనం ఉండేది కాదు. చిన్న కందకాలు తవ్వినా సమృద్ధి వర్షాలు కురిస్తే అవి మాయమైపోయేవి. సోషల్ ఆడిట్ తనిఖీల్లో ఆ పనులు కన్పించకుండా పోయే సరికి అక్రమాలు జరిగినట్లు నిర్ధారించేవారు. అలాంటి పనులు చేసి నిధులు వృథా చేసి, సోషల్ ఆడిట్‌లో దొరికే బదులు కళ్లకు కన్పించి భవిష్యత్తుకు ఉపయోగపడాలనే సంకల్పంతో ఫాంపాండ్స్ పనులపై అధికారులు శ్రద్ధ పెడుతున్నారు.

అటు భూముల చదును సైతం

నిబంధనల ప్రకారం ఫాంపాండ్ తవ్వకం పూర్తి చేయాలంటే 300 రోజుల పనిదినాలు కావాల్సి ఉంటుంది. రూ.లక్ష నిధుల ఖర్చుతో 12 మీటర్ల పొడవు, 12 మీటర్ల వెడల్పు, రెండు మీటర్ల లోతు తవ్వాల్సి ఉంటుంది. నిత్యం 50 మంది కూలీలు పనులు చేస్తే ఆరు రోజుల వ్యవధిలో ఒక ఫాంపాండ్ పూర్తవుతుంది. ఫాంపాండ్స్‌తో వర్షాలు కురిస్తే వరదనీరు చేరి భూగర్భజలాల పెంపునకు దోహద పడనుంది. తాజాగా బదిలీ అయిన ఎంపీడీఓ గుత్త నరేందర్‌రెడ్డి పట్టుబట్టి మరీ మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో ఫాంపాండ్స్ పనులు చేయించడానికి మొగ్గుచూపారు. దీంతో పాటు వ్యవసాయ పొలాల్లో భూమి చదును పనులు చేపట్టారు. వ్యవసాయ భూములు చదును కావడంతో వర్షాలు కురిస్తే పెరిగే భూగర్భజలాల ద్వారా వరి పంటతో పాటు పలు రకాల కూరగాయల పంటలు సాగు చేసుకుని రైతులు ఆర్థికంగా లబ్ధిపొందే అవకాశం ఉంటుంది.

మొదలైన సామాజిక తనిఖీలు

గతేడాది జరిగిన ఉపాధి పనులకు సంబంధించి గ్రామాల్లో సామాజిక తనిఖీల కార్యక్రమం మొదలైంది. మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31 వరకు జరిగిన ఉపాధి పనులపై సోషల్ ఆడిట్ సిబ్బంది తనిఖీలు చేస్తున్నారు. గతేడాది పలు గ్రామాల్లో అత్యధికంగా కుంటల మరమ్మతులు, రోడ్ల నిర్మాణం, భూ చదును పనులు, కంప చెట్ల తొలగింపు పనులు చేపట్టారు. దాదాపు రూ.6.73 కోట్ల పనులు చేపట్టారు. తాజాగా చేస్తున్న తనిఖీల్లో ఆ పనులు కన్పించడం లేదు. అందుకే బదిలీ అయిన ఎంపీడీఓ శాశ్వతంగా కన్పించే ఫాంపాండ్స్ పనుల వైపే ఆసక్తి చూపారు. కూలీల సంఖ్య పెరగకపోయినా ఫరవాలేదని, భవిష్యత్తులో భూగర్భజలాలు పెంచేలా ఫాంపాండ్స్ పనులు చేయించారు.

పనులు కష్టమైనా..



వేసవి కాలం, ఎండల తీవ్రత దృష్ట్యా కూలీలు ఫాంపాండ్స్ పనులు చేయడానికి ఆసక్తి చూప డం లేదు. అయినా మండలంలోని అన్ని గ్రామాల్లో వర్షాలు కురిస్తే నీరు వృథాగా పోకుండా భూగర్భజలాలు పెంచే విధంగా ఫాంపాండ్స్ గుంతలు తీయిస్తున్నాం. ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ మూడు నెలల్లోనే 126 ఫాంపాండ్స్ గుంతలు తీయించాం. ఇంకా తీయిస్తాం.

– శివశంకర్‌రెడ్డి, మండల ఈజీఎస్ ఈసీ

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

సీపీఎం జిల్లా కార్యదర్శి పగుడాల యాదయ్య

మంచాల: అక్రమ అరెస్టులతో ప్రజా ఉద్యమాలను ఆపడం ఎవరి తరం కాదని సీపీఎం జిల్లా కార్యదర్శి పగుడాల యాదయ్య అన్నారు. సోమవారం తెల్లవారు జామున మంచాల పోలీసులు ఆయనను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నగరంలో అందాల పోటీల్లో పాల్గొన్న వారు నాగార్జున సాగర్ పర్యటనకు వెళ్తుండడంతో వారిని అడ్డుకుంటారనే అనుమానంతో ముందస్తు అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా యాదయ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజా సంక్షేమం గాలికి వదిలేసి కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టి అందాల పోటీలు నిర్వహించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్రంలో పరిపాలన గాడి తప్పిందని విమర్శించారు. ఏడాదిన్నర కాలంలో ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని సక్రమంగా అమలు చేసింది లేదన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గోరెంకల నర్సింహ, కె.జగన్, మండల కార్యదర్శి రావుల జంగయ్య, మండల నాయకులు శ్యాం సుందర్, ఆవుల యాదయ్య పాల్గొన్నారు.



మంచాల పోలీస్‌స్టేషన్ ఆవరణలో సీపీఎం నాయకులు

నిబంధనలకు విరుద్ధంగా తరగతులు తగవు

ఏబీవీపీ రాష్ట్ర నాయకుడు క్యామ శ్రీకాంత్



విద్యార్థులను ఇంటికి పంపుతున్న ఏబీవీపీ నాయకులు

కడ్తాల్: వేసవి సెలవుల్లో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా తరగతులు నిర్వహిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర నాయకుడు క్యామ శ్రీకాంత్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని కృష్ణవేణి ఉన్నత పాఠశాలలో తరగతులు నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు సోమవారం ఏబీవీపీ నాయకులు పాఠశాలకు చేరుకున్నారు. తరగతులను బంద్ చేయించి విద్యార్థులను ఇంటికి పంపించివేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతూ వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు నిబంధనలు పాటించని ప్రైవేట్ పాఠశాలలపై దృష్టి సారించి, చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో విద్యార్థుల పక్షాన ఉద్యమించాడానికి సిద్ధమని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర నాయకులు లండం మల్లేశ్, గోరటి భరత్, కట్టుమల్ల విజయ్‌కుమార్, నగర కార్యదర్శి పవన్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి



రోడ్డుపై పారుతున్న డ్రైనేజీ నీటిని పరిశీలిస్తున్న అధికారులు

యాచారం: డ్రైనేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని అధికారులు తెలిపారు. మండలంలోని నానక్‌నగర్ గ్రామంలో రోడ్డుపై పారుతున్న డ్రైనేజీని సోమవారం ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలజ, మండల పంచాయతీ అధికారి శ్రీలత పరిశీలించారు. డ్రైనేజీ నీరు వచ్చి పంటలు పాడైపోతున్నాయని, తీవ్రంగా నష్టపోతున్నామని, ఏళ్లుగా చెబుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు వాపోయారు. మరోవైపు పలువురు గ్రామస్తులు జోక్యం చేసుకున్నారు. రైతుల అధీనంలో అసైన్డ్, గ్రామ కంఠం భూములున్నాయని వెంటనే సర్వే చేసి వాటిని స్వాధీనం చేసుకోవాలని, ఆ భూముల్లోంచి డ్రైనేజీ నీటిని వెళ్లనిచ్చేలా చూడాలని పేర్కొన్నారు. అనంతరం పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామస్తులతో సమావేశమైన అధికారులు డ్రైనేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు కాల్వ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి, కావాల్సిన నిధుల మంజూరుకు ఉన్నతాధికారులు, ఎమ్మెల్యేకు నివేదిస్తామని చెప్పారు. అప్పటివరకు యథాతథంగా డ్రైనేజీ నీటిని పోనివ్వాలని పట్టా భూముల రైతులకు సూచించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్‌లు ముత్యాల వెంకట్‌రెడ్డి, దంతుక పెద్దయ్య తదితురులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం

ఆమనగల్లు: మున్సిపాలిటీ పరిధిలోని విఠాయిపల్లి గ్రామంలో హైద్రాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రారంభించారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో లైట్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పర్వతాలు, శ్రీధర్‌నాయక్, సురేశ్‌నాయక్, పెరుమాల్ల వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, రవీందర్‌నాయక్, సుధాకర్‌రెడ్డి, కృష్ణ, జంగయ్య, లక్ష్మారెడ్డి, దావిద్ తదితరులు పాల్గొన్నారు.



విఠాయిపల్లిలో హైమాస్ట్ లైట్లను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పంటల సాగులో అవగాహన తప్పనిసరి

యాచారం: పంటల సాగు, ఎరువులు, పురుగు మందుల వాడకంలో రైతులు అవగాహన కలిగి ఉండాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్ రజనీకాంత్, అరుణ పేర్కొన్నారు. మండల పరిధిలోని నక్కర్తమేడిపల్లిలో సోమవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పంటల సాగులో వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించాలని తెలిపారు. ఎరువుల వాడకం, నీటి పొదుపు, భూసార పరీక్షలు తదితర విషయాలపై రైతులకు అవగాహన కల్పించారు. పంటల సాగుకు సంబంధించి కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రవినాథ్, పీఏసీఎస్ డైరెక్టర్ స్వరూప, వ్యవసాయ విస్తరణ అధికారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతుల్లో సాగు చేయాలి

ఇబ్రహీంపట్నం: ఆధునిక పద్ధతుల్లో పంటలు సాగు చేసి అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయ శాస్త్రవేత్త డా.కిరణ్‌బాబు అన్నారు. ఇబ్రహీంపట్నం ఖాల్సా రైతులకు ఉప్పరిగూడ సొసైటీ సమావేశ మందిరంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్‌బాబు మాట్లాడుతూ.. పంట సాగులో మెలకువలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి విద్యాధరి, ఏఈఓలు శ్రవణ్‌కుమార్, ఉప్పరిగూడ సొసైటీ చైర్మన్ పాండు రంగారెడ్డి, సీఈఓ గణేశ్ పాల్గొన్నారు.



యాచారం: పంటల సాగుపై కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు

బీఆర్‌ఎస్ నాయకుడికి పరామర్శ

ఆమనగల్లు: మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ వర్కింగ్ అధ్యక్షుడు చుక్క నిరంజన్‌గౌడ్ తల్లి బాలమ్మ మండల పరిధిలోని చింతలపల్లి గ్రామంలో ఆదివారం మృతిచెందింది. ఈ క్రమంలో సోమవారం నిరంజన్‌గౌడ్‌ను పలువురు పార్టీ నాయకులు కలిసి పరామర్శించారు. పరామర్శించిన వారిలో పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు పత్యానాయక్, నాయకులు రఘు, గుత్తి బాలస్వామి, పంతునాయక్, శ్రీనునాయక్, రమేశ్‌నాయక్, సురేశ్ తదితరులు ఉన్నారు.

వైభవంగా కల్యాణ మహోత్సవాలు



పోచారంలో జరిగిన ఉత్సవాలకు హాజరైన నాయకులు, భక్తులు

ఇబ్రహీంపట్నం రూరల్: మండలంలోని పోచారం, ఆదిబట్ల మున్సిపాలిటీలోని కొంగరకలాన్ లక్ష్మీ నర్సింహస్వామి దేవాలయాల్లో కల్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. కొంగరకలాన్‌లో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీర్వాదం తీసుకున్నారు.

రాజీవ్ యువ వికాస్‌లో ప్రాధాన్యత ఇవ్వాలి

ఎమ్మెల్యే కాలె యాదయ్యకు దివ్యాంగుల వినతి

మొయినాబాద్: రాజీవ్ యువ వికాస్ పథకంలో దివ్యాంగులకు ప్రాధాన్యత ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.నర్సింహాచారి ఎమ్మెల్యే కాలె యాదయ్యకు విన్నవించారు. ఈ మేరకు సోమవారం మొయినాబాద్‌లో ఎమ్మెల్యే కాలె యాదయ్యకు వినతిపత్రం అందజేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ కార్పొరేషన్‌లలో దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకున్న దివ్యాంగులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయనను కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దివ్యాంగులకు అవకాశం కల్పిస్తామని, వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తే వారు జీవన విధానాన్ని మెరుగు పర్చుకోవడానికి ఆస్కారం ఉంటుందన్నారు. అందుకోసం తమవంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, టీపీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్, జిల్లా దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు ఎం.సురేష్, సభ్యులు జ్ఞానేశ్వర్‌గౌడ్, విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

అనంతపద్మనాభస్వామి కల్యాణోత్సవం

కొత్తూరు: మండల పరిధిలోని పెంజర్లలో ఉన్న అనంతపద్మనాభస్వామి ఆలయంలో సోమవారం స్వామివారి కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణ వేడుకకు వచ్చిన భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అనితారెడ్డి, కేశంపేట మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు విశాల, కొత్తూరు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్యాంసుందర్‌రెడ్డి, నాయకులు సిద్దార్థరెడ్డి, శ్రావణ్‌రెడ్డి, రమేశ్, పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసిన నాయకులు

ఉత్సవాలకు ఆహ్వానం

మంచాల: గ్రామాల్లో అందిరినీ కలుపుకొనిపోయి ప్రశాంతంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుపుకోవాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సూచించారు. మంచాల గ్రామానికి చెందిన ముదిరాజ్ సంఘం నాయకులు సోమవారం నగరంలో ఆయనను కలిసి పెద్దమ్మతల్లి– గంగాదేవి కల్యాణోత్సవానికి ఆహ్వానించారు. ఈనెల 29 నుంచి జూన్ 1 వరకు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉత్సవాల నిర్వహణకు మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. అనంతరం ముదిరాజ్ సంఘం నాయకులు ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఆదిబట్ల మున్సిపల్ మాజీ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డిని కలిసి ఉత్సవాలకు ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, ఎడ్మా నరేందర్‌రెడ్డి, బైరిక రమాకాంత్‌రెడ్డి, మల్లేష్, లింగంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి దరఖాస్తు

ఆమనగల్లు: మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవి కోసం మాజీ సర్పంచ్, మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు దరఖాస్తు చేసుకున్నారు. హైదరాబాద్‌లో సోమవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి దరఖాస్తు అందించారు. తనకు పదవీ బాధ్యతలు అప్పగిస్తే పార్టీ పటిష్టత కోసం కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ధనుంజయ, కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్, ఖాదర్, రచ్చ శ్రీరాములు, శ్రీనునాయక్ తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి దరఖాస్తు పత్రం అందిస్తున్న గుర్రం కేశవులు

మురళీనాయక్‌కు ఘన నివాళి



ర్యాలీలో పాల్గొన్న గిరిజన సంఘాల నాయకులు

ఆమనగల్లు: పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో వీర మరణం పొందిన అమరజవాన్ మురళీనాయక్‌కు నివాళిగా ఆమనగల్లు పట్టణంలో సోమవారం రాత్రి గిరిజన సంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన రహదారిపై నుంచి ర్యాలీగా వెళ్లి రాజీవ్‌చౌరస్తా వద్ద మురళీనాయక్ చిత్రపటం ఉంచి నివాళి అర్పించారు. కార్యక్రమంలో వివిధ పార్టీల, గిరిజన సంఘాల నాయకులు పత్యానాయక్, రాంపాల్‌నాయక్, డా.చందునాయక్, శ్రీనునాయక్, పంతునాయక్, రవిరాథోడ్, నరేందర్‌రాథోడ్, రమేశ్‌నాయక్, కర్నాటి విక్రంరెడ్డి, లక్ష్మణ్, గోరటి నర్సింహ, మహేశ్, సీతారాంనాయక్, బాలునాయక్, జయరాంనాయక్, శ్రీనునాయక్, ఈశ్వర్, భరత్, పాపిశెట్టి రాము తదితరులు పాల్గొన్నారు.

కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్రం

ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పర్వతాలు



సార్వత్రిక సమ్మె వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాల్లో మార్పులను తీసుకొచ్చి హక్కులను కాలరాస్తోందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు విమర్శించారు. అఖిల భారత కార్మిక సంఘాలు ఈ నెల 20న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మె వాల్‌పోస్టర్‌ను సోమవారం ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీను ఆధ్వర్యంలో నాయకులు ఆవిష్కరించారు. సోమవారం పట్టణంలోని ముఖ్య కూడలిలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పర్వతాలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను సవరిస్తూ నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చిందని ఆరోపించారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకోకుండా చట్టాలను మార్చుతోందని విమర్శించారు. కార్మికులు కోల్పోయిన చట్టాలను తిరిగి పొందడానికి జరిగే పోరాటంలో కార్మికులు విజయం సాధించాలని ఆకాంక్షించారు. దేశంలో రోజురోజుకూ నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలు కొనుగోలుచేసే పరిస్థితి లేకుండా పోతోందన్నారు. పెరుగుతున్న ధరలను నియంత్రించడంలో కేంద్రం పూర్తిగా విఫలమవుతోందని విమర్శించారు. కార్మికులు తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ ఈ నెల 20న సార్వత్రిక సమ్మెకు దిగుతున్నారని, కార్మికులు, కర్షకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. క్యాక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి జంగయ్య, కేశంపేట మండల కార్యదర్శి గోవిందు, ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు చంద్రబాబు, నాయకులు గోపాల్, రవి, కార్మికులు పాల్గొన్నారు.